
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
ఆదివారం 28 సెప్టెంబరు 2025



5

సినిమాయం.!
తగ్గుతున్న ప్రేక్షకులు.. బోసిపోతున్న థియేటర్లు
కొత్తసినిమా వస్తేనే కాసింత కళ.. టికెట్ల రేట్లతో దూరం
టాకీసుల స్థానంలో షాపింగ్‌మాల్లు
ఓటీటీలకే ఓటేస్తున్న ప్రేక్షకులు
7 లో



నూతన సీపీగా విజయ్‌కుమార్

- డాక్టర్ బి.అనురాధ బదిలీ



విజయ్‌కుమార్

సిద్దిపేట క్రైం సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట నూతన సీపీగా విజయ్‌కుమార్ బదిలీపై రానున్నారు. ఇంతకుముందు సీపీ డాక్టర్ బి.అనురాధ రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఎల్బీనగర్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా బదిలీ అయ్యారు. ఆమె సుమారు 21 నెలలుపైగా ఇక్కడ పని చేశారు. ఆమె స్థానంలో హైదరాబాద్ వెస్ట్‌జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా పనిచేస్తున్న విజయ్‌కుమార్ బదిలీ అయ్యారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలోనే విజయ్‌కుమార్ సిద్దిపేట సీపీగా బాధ్యతలు చేపట్టనున్నారు.









చేర్యాల పట్టణం సెవెన్ హిల్స్ ప్రాంతంలో నిలిచిన నీరు

మండలం	వర్షపాతం (మిల్లీమీటర్లలో)
చేర్యాల	67.8
కొమురవెల్లి	59.8
అక్కన్నపేట	51.3
నంగునూర్	41.3
ధూళిమిట్ట	35.0
కొండపాక	28.5
రాయపోల్	20.5
మర్కూక్	20.3
కోహెడ	19.3
మద్దూర్	18.8
హుస్నాబాద్	17.5

దంచికొట్టింది

చేర్యాలలో అత్యధికంగా 67.8 మి.మీ.

సిద్దిపేట/చేర్యాల సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం దంచికొట్టింది. దీంతో జిల్లాలోని పలు చెరువులు, చెక్‌డ్యాంలు పొంగిపొర్లుతున్నాయి. చేర్యాల, కొమురవెల్లి, అక్కన్నపేట, నంగునూర్ మండలాల్లో భారీ వర్షం కురియగా, దూళిమిట్ట, కొండపాక, హుస్నాబాద్, రాయపోల్, మర్కుక్, కోహెడ, మద్దూరులలో మోస్తరు వర్షం కురిసింది. చేర్యాలలో అత్యధికంగా 67.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి కొమురవెల్లి మండలంలోని మర్రిముస్త్యాల గ్రామానికి చెందిన వేచరేణి భాగ్యకు చెందిన ఇంటి పైకప్పు, అదే గ్రామానికి చెందిన ఇంద్రపురి కనకయ్య ఇల్లు కూలిపోగా రెవెన్యూ అధికారులు కూలిన ఇంటిని పరిశీలించారు. శనివారం ఉదయం నుంచి జిల్లాలోని పలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురుస్తున్నాయి.

చేర్యాల జలదిగ్బంధం

శుక్రవారం రాత్రి నుంచి ఏకధాటిగా శనివారం తెల్లవారుజాము వరకు చేర్యాలలో జోరు వర్షం కురిసింది. దీంతో కురుస్తున్న వర్షానికి వరద నీటి ప్రవాహంతో జనగామ - సిద్దిపేట జాతీయ ప్రధాన రహదారిపై గాంధీచౌక్ నుంచి బస్టాండు ఏరియా వరకు పట్టణం జలదిగ్బంధమైంది. పట్టణంలోని కుడిచెరువుకు వరదనీరు మళ్లే నాలాలు యథేచ్ఛగా ఆక్రమణకు గురవడం, కల్వర్టులు మూసివేయడంతో కడవేరుగు దారి, ఆర్టీసీ బస్టాండు ఏరియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్

మిగతా 8వ పేజీలో



పొంగిపొర్లుతున్న నంగునూరు మండలంలోని అక్కెనపల్లి వాగు



మల్లన్న ఆలయ మహామండపం లీకేజీ

ఏడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కొమురవెల్లి మల్లన్న ఆలయంలోని మహామండపం స్లాబ్ నుంచి వర్షపు నీరు లీక్ అవుతుంది. వర్షాలు కురిసిన ప్రతీసారి లీక్ అవుతుండగా, ప్రసాదాల విక్రయశాల వద్ద కూడా స్లాబ్ లీకేజీ అవుతున్నా పట్టించుకోవడం లేదు.

- కొమురవెల్లి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి)



కొండపాక పీహెచ్‌సీలో కలెక్టర్ ఆకస్మిక సందర్శన

కొండపాక, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కొండపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కె.హైమావతి శనివారం ఆకస్మికంగా సందర్శించి 'స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా చేస్తున్న వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండలంలోని 85 మందికి మహిళలకు వైద్యం అందించామని కలెక్టర్‌కి సిబ్బంది తెలిపారు. నిపుణుల వైద్యులతో 14 రకాల వైద్య చికిత్సలను అందిస్తున్నట్లు, జిలాలోని అన్ని పీహెచ్‌సీలలో అక్టోబరు 2 వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొనాలని కలెక్టర్ హైమావతి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న

నిర్మలాజగ్గారెడ్డి, జయా గుణచైతన్యరెడ్డి

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సదాశివపేటలోని భవిత జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం జరిగిన బతుకమ్మ సంబరాల్లో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, కూతురు యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు జయా గుణచైతన్యరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కళాశాల యాజమాన్యం, మహిళ అధ్యాపకులు, సిబ్బందితో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా జయారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా బతుకమ్మ పండగ ఘనంగా నిర్వహిస్తున్నామని అన్నారు. తీరొక్క పూలను పూజించే ఏకైక పండగ బతుకమ్మ పండగ అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాంరెడ్డి, వై ప్రభు పాల్గొన్నారు.



సదాశివపేట భవిత కళాశాలలో జరిగిన బతుకమ్మ సంబరాల్లో మాట్లాడుతున్న యువజన కాంగ్రెస్ నాయకురాలు జయా గుణచైతన్యరెడ్డి



సదాశివపేటలోని భవిత కళాశాలలో బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, జయా గుణచైతన్యరెడ్డి



సిద్దిపేట ఆర్డీవో కార్యాలయంలో పలు పార్టీల నేతల సందడి

వీడిన ఉత్కంఠ.!

పంచాయతీ, పరిషత్ రిజర్వేషన్లు ఖరారు

- జాబితాతో ఢీలాపడిన చాలామంది ఆశావహులు
- పలువురి రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకం
- బీసీ జనరల్‌కే జడ్పీ చైర్మన్
- ఇక నోటిఫికేషన్ కోసం ఎదురుచూపులు
- వివాదాస్పదంగా మారిన రిజర్వేషన్ల కేటాయింపు

ఎట్టకేలకు గ్రామపంచాయతీ, పరిషత్ ఎన్నికల రిజర్వేషన్లు ఖరారయ్యాయి. జిల్లా పరిషత్ చైర్మన్ స్థానంతో పాటు జిల్లాలోని జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు రిజర్వేషన్లు కేటాయించారు. కొందరికి మాత్రమే అనుకూలంగా రిజర్వేషన్లు రాగా.. మెజార్టీ ఆశావహులకు నిరాశ తప్పలేదు. రెండేళ్లుగా ఎదురుచూసిన కొందరు నాయకులు నైరాశ్యంలో మునిగిపోయారు. రిజర్వేషన్లతో తమ రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని కన్నీళ్లు పెడుతున్నారు. ఇక ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేయడమే మిగిలింది.

జడ్పీటీసీ, ఎంపీపీ రిజర్వేషన్లు

మండలం	జడ్పీటీసీ	ఎంపీపీ
అక్బరుపేట-భూంపల్లి	ఎస్సీ జనరల్	ఎస్సీ మహిళ
అక్కన్నపేట	జనరల్	జనరల్ మహిళ
బెజ్జంకి	జనరల్	జనరల్ మహిళ
చేర్యాల	ఎస్సీ మహిళ	ఎస్సీ మహిళ
చిన్నకోడూరు	బీసీ జనరల్	బీసీ మహిళ
ధూళిమిట్ట	ఎస్టీ జనరల్	ఎస్టీ జనరల్
దౌల్తాబాద్	బీసీ మహిళ	బీసీ జనరల్
దుబ్బాక	ఎస్సీ జనరల్	ఎస్సీ జనరల్
గజ్వేల్	జనరల్ మహిళ	జనరల్
హుస్నాబాద్	జనరల్ మహిళ	జనరల్
జగదేవ్‌పూర్	బీసీ మహిళ	బీసీ మహిళ
కోహెడ	బీసీ జనరల్	బీసీ జనరల్
కొమురవెల్లి	బీసీ మహిళ	బీసీ జనరల్
కొండపాక	జనరల్	జనరల్
కుకునూరుపల్లి	ఎస్సీ మహిళ	ఎస్సీ జనరల్
మద్దూరు	బీసీ మహిళ	బీసీ మహిళ
మర్కుక్	జనరల్	జనరల్ మహిళ
మిరుదొడ్డి	బీసీ జనరల్	బీసీ మహిళ
ములుగు	జనరల్	జనరల్
నంగునూరు	బీసీ జనరల్	బీసీ జనరల్
నారాయణరావుపేట	బీసీ జనరల్	బీసీ మహిళ
రాయపోల్	జనరల్ మహిళ	జనరల్ మహిళ
సిద్దిపేట రూరల్	ఎస్సీ జనరల్	ఎస్సీ జనరల్
సిద్దిపేట అర్బన్	బీసీ జనరల్	బీసీ జనరల్
తొగుట	బీసీ మహిళ	బీసీ జనరల్
వర్గల్	జనరల్ మహిళ	జనరల్

సిద్దిపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : సిద్దిపేట జిల్లాలోని 26 మండలాలకు సంబంధించిన జడ్పీటీసీ, ఎంపీపీలతోపాటు 230 ఎంపీటీసీ, 508 సర్పంచ్ స్థానాలకు అధికారికంగా రిజర్వేషన్లు

మిగతా 8వ పేజీలో

నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి


- ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్
- ఇర్కోడు, దుబ్బాక, కుకునూరుపల్లిలో ఏటీసీల ప్రారంభం



ఇర్కోడులో ఏటీసీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ దేశపతి

సిద్దిపేట రూరల్/దుబ్బాక/కుకునూరుపల్లి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి) : పోటీ ప్రపంచంలో మారుతున్న నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు పెంపొందించుకోవాలని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ విద్యార్థులకు సూచించారు. శనివారం సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐతో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయన్నారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ విద్యార్థులకు మంచి అవకాశం అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ ఎస్.రామానుజ తదితరులు పాల్గొన్నారు. దుబ్బాకలోని ఐటీఐ కళాశాలలో ఏటీసీని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కనకయ్యతో కలిసి ప్రారంభించారు. సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా ఐటీఐ కళాశాలలోని ఏటీసీలను ప్రారంభించగా, కుకునూరుపల్లి శివారులోని ఐటీఐ కాలేజ్‌లో కలెక్టర్ హైమావతి, అదనపు కలెక్టర్ గరీమాఅగ్రవాల్, ప్రిన్సిపాల్ రమణ తదితరులు పాల్గొన్నారు.





పూర్తికాని పుష్పాల వాగు పనులు

● ఆరు గ్రామాలు, రెండు తండాలకు నిలిచిన రాకపోకలు
● 30 రోజులైనా తాత్కాలిక మరమ్మతులకు నోచుకోలేదు
● ఆర్థిక భారంతో పాటు అత్యవసర పరిస్థితులలో ఇబ్బందులు

మెదక్, కల్చరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పుష్పాల వాగు వంతెన పరిసరాలు కొట్టుకుపోయి ఆరు గ్రామాలకు, రెండు తండాలకు రాక పోకలు నిలిచిపోయాయి. అయితే ఇప్పటికే 30 రోజులు గడుస్తున్నా నేటికి తాత్కాలిక మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఆరు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైతే కొంటూర్ నుంచి రాక పోకలు కొనసాగిస్తున్నా, వర్షం ఎక్కువైతే ఆ చెరువు అలుగు పారడం ఎక్కువైతే రాకపోకలు నిలిచిపోతాయి. ఇదే కాకుండా కొంటూరు నుంచి మెదక్‌కు రావాలంటే 14 కిలోమీటర్ లవుతుంది. దీంతో ఆర్థిక భారంతో పాటు అత్యవసర పరిస్థితులలో ఇబ్బందులు తప్పడం లేదని ఆ గ్రామాల ప్రజలు వాపోతున్నారు. వెంటనే పుష్పాల వాగు వంతెన మరమ్మతులు పూర్తి చేస్తే ఇక్కడి నుండి మెదక్‌కు 6 కిలో మీటర్ల దూరం మాత్రమే అవుతుంది దీంతో ఆర్థిక భారంతో పాటు అవస్థలు తప్పుతాయంటున్నారు. అయితే తాత్కాలిక మరమ్మతులు ప్రారంభించామని హడావిడిగా ఒక రోజు బ్రిడ్జిలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించి మళ్లీ ఆ పనిని నిలిపి వేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గోడు వింటారని తాత్కాలిక మరమ్మతులు చేసి రాకపోకలు పునరుద్ధరిస్తారని అక్కడి వారందరూ ఎదురు చూస్తున్నారు.


ఒక్క రోజు మాత్రమే జేసీబీతో చెత్త తొలగిస్తూ


బ్రిడ్జి పరిసరాలు కొట్టుకుపోవడంతో నిలిచిన రాకపోకలు

రాష్ట్రస్థాయి ఉషు పోటీల్లో జిల్లాకు ప్రథమ, తృతీయ స్థానాలు

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ ఎస్ జీఎఫ్ ఉషు పోటీలు అండర్ 19 బాలురు, బాలికల విభాగంలో సంగారెడ్డి జిల్లా ప్రథమ, తృతీయ స్థానాలను కైవసం చేసుకుంది. బీరంగూడ భూపాల్ రెడ్డి కాలేజీకి చెందిన కె. సాహితి అండర్ 19 (45 కేజీల) విభాగంలో బంగారు పథకం సాధించి రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎంపికయ్యింది. అండర్ 19 (48 కేజీల) బాలుర విభాగంలో చిట్కుల్ వడ్డెర కాలనీకి చెందిన అలకుంట ఉల్లయ్య తృతీయ బహుమతి కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా ఇద్దరినీ ఉపాధ్యాయులు స్థానికులు అభినందించారు. కుమార్ మాస్టారు కృషితోనే తాము విజయం కైవసం చేసుకున్నామని ఈ సందర్భంగా సాహితి, ఉల్లయ్యలు విలేకరులు తెలిపారు. తమకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తే తాము మరిన్ని విజయాలకు కైవసం చేసుకుంటామన్నారు. ఇరు కుటుంబాలు ఆర్థికంగా వెనకబడిన వర్గాలు అయినందున స్వచ్ఛంద సంస్థలు గాని, ప్రభుత్వం గాని వారిని ప్రోత్సహిస్తే రాష్ట్ర జాతీయ స్థాయిలో వారు మరిన్ని విజయాలు కైవసం చేసుకుని జిల్లాకు రాష్ట్రానికి మంచి పేరు తెస్తారని ఈ సందర్భంగా కోచ్ కుమార్ మాస్టర్ తెలిపారు.


ప్రథమ బహుమతి సాధించిన సాహితి కోచ్‌తో


తృతీయ బహుమతి సాధించిన ఉల్లయ్య

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి

● మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసులపై దృష్టి సారించి, త్వరగా పరిష్కరించాలని మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాస రావు పోలీసుల అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షలో ఆయన నేరాల పరిస్థితి, పెండింగ్ కేసుల పరిణామాలు, విచారణలో ఉన్న కేసుల పురోగతి తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కేసుల సంఖ్య తగ్గించడానికి ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. పోక్స్ అండర్ ఇన్వెస్టిగేషన్ ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల్లో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ చేయాలన్నారు. కేసుల నమోదు నుంచి చార్జ్‌షీట్ దాఖలు వరకు ప్రతి దశను సమగ్రంగా పరిశీలించాలన్నారు. నేరాల నియంత్రణకు సాంకేతిక ఆధారాలతో కూడిన ఆధునిక పద్ధతులను అమలు చేయాలన్నారు. సీసీ టీవీలను కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారణ, ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్, లోన్ యాప్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సమీక్షలో అదనపు ఎస్పీ మహేందర్, మెదక్, తూప్రాన్ డీఎస్పీలు ప్రసన్నకుమార్, నరేందర్ గౌడ్, సీ ఐలు, ఎస్సైలు, అధికారులు పాల్గొన్నారు.

దాబా సీజ్ చేసిన పోలీసులు

నిజాంపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన ఓ దాబాను పోలీసులు శనివారం సీజ్ చేశారు. నిజాంపేట మండల పరిధి కల్వకుంట గ్రామ శివారులో గల భవానీ దాబా కొన్నేళ్లుగా యజమాని వెంకట్ గౌడ్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడు. దీంతో ఆర్డీవో రమాదేవికి అందిన ఫిర్యాదు మేరకు ఎస్సై రాజేష్, ఆర్ఐ ఇమద్‌లు దాబాను సీజ్‌చేసి యజమానికి నోటీసులు అందజేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

చిన్నకోడూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అనుమానస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చిన్నకోడూరులో శనివారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నకోడూరుకు చెందిన కొలనుశంకర్ (45) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం సాయంత్రం శంకర్ తన వ్యవసాయ బావి దగ్గర అనుమానస్పద స్థితిలో మృతిచెందాడు.మృతుడికి భార్య కనకవ్వ, కుమారుడు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చెరువులో దూకి బ్రేక్ డౌన్‌ను క్లియర్ చేసిన విద్యుత్ సిబ్బంది


బ్రేక్‌డౌన్‌ను క్లియర్ చేసిన సిబ్బందితో ప్రజ్ఞాపూర్ సెక్షన్ ఏఈ సత్యం

గజ్వేల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ నుంచి అహ్మదీపూర్‌కు వచ్చే 33కేవీ ఎక్స్‌ప్రెస్ ఫీడర్‌పై చెట్టుపడి బ్రేక్ డౌన్ అవడంతో విద్యుత్ సిబ్బంది ప్రాణాలకు తెగించి మరీ విద్యుత్‌ను పునరుద్ధరించారు. గజ్వేల్ నుంచి ప్రజ్ఞాపూర్ సెక్షన్‌లోని అహ్మదీపూర్ ఫీడర్‌కు వచ్చే లైన్ గజ్వేల్ పాండవుల చెరువులో చెట్టు పడి తెగిపోయింది. వెంటనే స్పందించిన ప్రజ్ఞాపూర్ విద్యుత్ లైన్‌మన్ హన్మంతు, ఏఎల్ఎం జహంగీర్‌లు పాండవుల చెరువులోకి దూకి చెట్టు కొమ్మలను నరికి, విద్యుత్ లైన్‌కు మరమ్మతులు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా హన్మంతు, జహంగీర్‌తో పాటు వారికి సహకరించిన ఆర్టిజన్ రవి, లైన్ ఇన్‌స్పెక్టర్ జయసింహారావు, జహంగీర్‌లను ప్రజ్ఞాపూర్ సెక్షన్ ఏఈ సత్యాన్ని డీఈ భానుప్రకాశ్, ఏడీ జగదీశ్‌ఆర్య అభినందించారు.

ఆల్ప్రాజోలం పట్టివేత

గజ్వేల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కల్లులో అక్రమంగా కలుపుతున్న నిషేధిత ఆల్ప్రాజోలాన్ని గజ్వేల్ పట్టణంలోని ఓ కల్లు కాంపౌండ్‌లో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ ఆర్అండ్ఆర్ కాలనీలోని పల్లెపహాడ్‌లో నలుగురు వ్యక్తులు కలసి కల్లు అమ్ముతున్నారని గజ్వేల్ అదనపు ఇన్‌స్పెక్టర్ ముత్యంరాజు తెలిపారు. మర్కుక్ మండలం పాములపర్తికి చెందిన తదురి లక్ష్మణ్‌గౌడ్, మెదక్ జిల్లా తూప్రాన్ మండలం ఇస్లాంపూర్‌కు చెందిన మెతుకు నర్సింలుగౌడ్, నార్సింగి మండల కేంద్రానికి చెందిన గౌడ శ్రీకాంత్‌గౌడ్, కాచాపూర్ గ్రామానికి చెందిన పాలమాకుల సాయికుమార్‌గౌడ్‌లు కలసి నిషేధిత ఆల్ప్రాజోలాన్ని కల్లులో కలిపి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్న సమాచారంతో దాడి చేశామన్నారు. వారివద్ద నుంచి రూ.84వేల విలువ చేసే 210 గ్రాముల నిషేధిత ఆల్ప్రాజోలం, 175 గ్రాముల మిక్స్‌డ్ ఆల్ప్రాజోలం, 40గ్రాముల మిక్స్‌డ్ పౌడర్, 250గ్రాముల వైట్ పౌడర్, 200గ్రాముల కట్టు, 1250 గ్రాముల సచరినే, 250 గ్రాముల సోడా, 100 గ్రాముల బ్లాక్ గ్రామ, మూడు మోబైల్ ఫోన్లు, ఒక కారు, రెండు క్యాలిక్యూలేటర్లు, నాలుగు డాడీ ప్యాకెట్లు, స్వాధీనం చేసుకుని, ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. వారితో సాయికుమార్‌గౌడ్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

కొండా లక్ష్మణ్ అంకితభావమే యువతకు ఆదర్శం

ప్రొఫెసర్ కోదండరామ్


ఉద్యాన విశ్వవిద్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా గ్రూప్ ఫొటో

ములుగు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చిరకాల స్వప్నాన్ని సాధించడంలో శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ నాయకత్వం కీలక పాత్ర పోషించిన మార్గదర్శకులని ప్రొఫెసర్ ఎం. కోదండరామ్ అభివర్ణించారు. శనివారం ములుగు మండల కేంద్రంలోని ఉద్యాన విశ్వవిద్యాలయంలో కొండా లక్ష్మణ్ జయంతి ఉప కులపతి దండ రాజిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన జయంతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోదండరాం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం కోసం పోరాటం చేసిన వ్యక్తి కొండ లక్ష్మణ్ బాబు 110 జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఆయన చేసిన పోరాటాన్ని కొనియాడారు. అనంతరం వైస్-ఛాన్సలర్ డాక్టర్ డి. రాజి రెడ్డి మాట్లాడుతూ... బాపూజీ అవిశ్రాంత పోరాటం దార్శనికత అందరికీ ఆదర్శనీయమని తెలిపారు. బాపూజీ వ్యవసాయ అభివృద్ధి, సామాజిక న్యాయం అనే తత్వశాస్త్రంలో లోతుగా పాతుకుపోయిన రైతులను శక్తివంతం చేసే ఉద్యాన విద్య, పరిశోధన విస్తరణ సేవలను ముందుకు తీసుకెళ్లడానికి విశ్వవిద్యాలయం నిబద్ధతతో ఉందని ఆయన పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్టర్ డాక్టర్ ఏ. భగవాన్, డీన్ డాక్టర్ జె. చీనా, డాక్టర్ టి.సురేష్ కుమార్, డాక్టర్ ఎన్. శ్రీనివాసన్, డాక్టర్ ఎం.రాజశేఖర్, విశ్వవిద్యాలయ అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

రుణం చెల్లించలేదని మండిపాటు..

● మనస్తాపంతో మహిళ ఆత్మహత్యాయత్నం ● ఆసుపత్రిలో మృతి


ఆయేషా బేగం (ఫైల్)

హత్నూర, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామైక్య సంఘంలో తీసుకున్న రుణం తిరిగి చెల్లించలేదని సంఘ సభ్యులు దూషిస్తూ, మందలించడంతో మనస్తాపానికి గురైన మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. ఆమెను హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా, అక్కడ శనివారం చనిపోయింది. ఇందుకు సంబంధించిన వివరాలు.. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం కాసాల గ్రామానికి చెందిన ఆయేషాబేగం (30) కొన్ని నెలల క్రితం తన అవసరాల కోసం గ్రామైక్య సంఘంలో రుణం తీసుకుంది. మూడు నెలలుగా డబ్బులు అందక కిస్తీలు చెల్లించలేదు. దీంతో గ్రూపు సభ్యులు కొందరు ఆయేషా ఇంటికి వెళ్లి దూషించడంతో ఆమె ఈ నెల 19న క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఇన్నాళ్లు అక్కడ చికిత్స పొందిన ఆయేషా శనివారం చనిపోయింది. కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హత్నూర ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

బావిలో పడి వ్యక్తి ..

జహీరాబాద్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని రాయిపల్లి(డి) గ్రామశివారులో గల వ్యవసాయబావిలో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. జహీరాబాద్ రూరల్‌ఎస్సై కాశీనాథ్ కథనం ప్రకారం.. రాయిపల్లి(డి) గ్రామానికి చెందిన చాకలిప్రవీణ్(29) శనివారం ఉదయం మామిడి కొమ్మలు తీసుకురావడానికి బయటకు వెళ్లాడు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో ఇరుగు పొరుగు, బంధువులు వద్ద వెతికినా ఆచూకీ లభించ లేదు. తీరా గ్రామసమీపంలోని ఓరైతు వ్యవసాయబావిలో శవమై కనిపించాడు. మృతుడి తండ్రి చాకలితుకారం ఫిర్యాదుతో కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

మంజీరా బ్యారేజ్‌కు ప్రమాదం లేదు

● వాటర్ బోర్డు చైర్మన్ అశోక్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వాటర్ బోర్డు చైర్మన్ అశోక్‌రెడ్డి

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని మంజీరా బ్యారేజ్‌కు ఎలాంటి ప్రమాదం లేదని వాటర్ బోర్డు చైర్మన్ అశోక్‌రెడ్డి స్పష్టం చేశారు. సంగారెడ్డిలోని ఐబీలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 25 ఏళ్ల తర్వాత మంజీరా రిజర్వాయర్‌కు భారీగా వరద నీరు వచ్చిందని, దీంతో ఫిల్టర్ బెడ్ నీట మునిగిందన్నారు. ఈ ఫిల్టర్ బెడ్‌ను రెండు, మూడు రోజుల్లో బాగు చేయిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి వరద పరిస్థితులపై నిరంతరం సమీక్షిస్తున్నారని చెప్పారు. సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలలో అత్యధిక వర్షపాతం నమోదైందని, 2000 సంవత్సరం తర్వాత ఇప్పుడు మళ్లీ ఆ స్థాయిలో వరద వచ్చిందన్నారు. వర్షం ఎక్కువగా కురవడం వల్ల సదాశివపేట మండలం పెద్దాపూర్ వద్ద ఉన్న ఫేస్ 3,4 పంపుల వద్ద సమస్య తలెత్తిందని, మరమ్మతులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నామన్నారు. దీనివల్ల నిలిపిన తాగునీటి సరఫరాను వెంటనే పునరుద్ధరిస్తామని చెప్పారు. అలాగే హైదరాబాద్ ప్రాంతానికి తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవని స్పష్టం చేశారు. ఫిల్టర్ బెడ్‌లకు వరద నీరు రాకుండా శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. అంతకుముందు సదాశివపేట మండలం పెద్దాపూర్, సంగారెడ్డిలోని రాజంపేట ఫిల్టర్ బెడ్‌లను ఆయన పరిశీలించారు.

పేదల భూములు లాక్కుంటారా?

● సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చుక్క రాములు



సంగారెడ్డి కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రభుత్వమంటూ గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం ట్రిపుల్ ఆర్ పేరుతో పేదల భూములు లాక్కుంటారా? అని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చుక్క రాములు ప్రశ్నించారు. శనివారం సంగారెడ్డి కలెక్టరేట్ ముందు సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో కోట్ల విలువ చేసే భూములను అప్పనంగా తీసుకోవడం రైతులను మోసం చేయడమేనని అన్నారు. భూములపై ఆధారపడి బతికే అన్నదాతల బతుకులను ఆగం చేయడమేనా ప్రజాపాలన అంటే అంటూ ప్రశ్నించారు. బలవంతపు భూసేకరణ ఆపకపోతే రైతులందరినీ ఏకం చేసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ ధర్నాలో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్లేశం, మాణిక్యం, జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణ, నాయకులు బాగారెడ్డి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

అసమానతలపై అక్షర యుద్ధం చేసిన మహాకవి జాషువా

● కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు



జాషువా చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న స్కైలాబ్ బాబు

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మహాకవి జాషువా అసమానతలపై అక్షర యుద్ధం చేశారని కుల వివక్ష పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు అన్నారు. జాషువా 130వ జయంతి సందర్భంగా సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. భారతదేశ సామాజిక, సాహిత్య రంగంలో జాషువా కవిత్వం ఒక చైతన్య స్ఫూర్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శివకుమార్, అశోక్, డప్పోల్ల రమేశ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

దేశరాజు శ్యాంసుందర్ స్థపతికి అత్యుత్తమ పర్యాటక పురస్కారం



మంత్రి జూపల్లి నుంచి పురస్కారాన్ని అందుకుంటున్న శ్యాంసుందర్ స్థపతి

రాయపోల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని రాయపోల్ మండలం అనాజీపూర్‌కు చెందిన దేశరాజు శ్యాంసుందర్ స్థపతి అత్యుత్తమ పర్యాటక పురస్కారాన్ని అందుకున్నారు. పర్యాటకం అనే అంశంపై బాలచెలిమి మాసపత్రికలో రాస్తున్న వ్యాసాలకు గాను ఈ పురస్కారం లభించింది. పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, పర్యాటక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, డీజీపీ జితేందర్, ఎండీ వల్లూరి క్రాంతి, కిషన్‌రావు, ప్రియాంక, ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్‌రాజు పాల్గొన్నారు.

మర్పడగ క్షేత్రంలో జిల్లా జడ్జి పూజలు



విజయ దుర్గామాత ఆలయంలో పూజలు చేస్తున్న జడ్జి

కొండపాక, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం మర్పడగ విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో సిద్దిపేట జిల్లా కోర్టు జడ్జి సాయి రమాదేవి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అలాగే మల్లికార్జున స్వామి దేవాలయంలో కూడా పూజలు చేశారు. ఈ సందర్భంగా క్షేత్ర నిర్వాహకులు హరినాథ్ శర్మ ఆలయ మర్యాదలతో ఆమెను సత్కరించారు.

సినిమాయం.!

హాలు నిండినది.. నడుస్తున్న చిత్రాలు.. మా రాబోయే చిత్రాలు అంటూ కొత్త కొత్త పోస్టర్లు.. బుకింగ్ కౌంటర్ల వద్ద టికెట్ కోసం కుస్తీపట్లు.. ఇవి ఒకప్పుడు ఏ థియేటర్ దగ్గర చూసినా కనిపించిన దృశ్యాలు. గ్రామాల నుంచి ఎడ్ల బండ్లు కట్టుకుని వచ్చి మరీ సినిమాలు చూసేవారు. ఒకప్పుడు చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు ఆనందాన్ని పంచిన సినిమా హాళ్లు చిన్నబోతున్నాయి. కొత్త సినిమా వచ్చిన ఒకటి, రెండు రోజులు మినహా సినిమా హాళ్ల వద్ద సందడి కనిపించకుండా పోతోంది. అసలు గతంలో ఉన్నన్ని థియేటర్ల స్థానంలో షాపింగ్ కాంప్లెక్స్‌లు.. ఫంక్షన్ హాళ్లు వచ్చేశాయి.

- తగ్గుతున్న ప్రేక్షకులు
- బోసిపోతున్న థియేటర్లు
- కొత్తసినిమా వస్తేనే కాసింత కళ
- భయపెడుతున్న టికెట్ల రేట్లు
- వాటి స్థానంలో షాపింగ్ మాళ్లు
- ఓటీటీలకే ఓటేస్తున్న ప్రేక్షకులు







మెదక్, సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): మెదక్‌లోని ఓ థియేటర్‌కు ముగ్గురు స్నేహితులు ఓ సినిమా చూద్దామని వెళ్లారు. షో టైం అవుతున్నా టికెట్లు ఇవ్వకపోవడంతో అక్కడున్న సిబ్బందిని ఆరా తీయగా.. 'మీతో పాటు మరొకరు వచ్చారు సార్.. నలుగురితో సినిమా నడపలేం' అంటూ సమాధానం ఇచ్చారు. దీంతో చేసేదేమీ లేక ఆ ముగ్గురు మిత్రులు తిరుగుముఖం పట్టారు. ఒకప్పుడు హౌస్‌ఫుల్‌తో కిటకిటలాడిన థియేటర్లలో 30-40 మంది కూడా కనిపించడం లేదు. ఇందుకు కారణాలు అనేకం. ఒకప్పుడు అందరికీ అందుబాటులో ఉండే సినిమా టికెట్ల రేట్లు పెరిగిపోయాయి. వందలు పెడితే తప్ప సినిమా చూసే పరిస్థితి కనిపించడం లేదు. ఇక థియేటర్ వరకు రానుపోను రవాణా ఖర్చులు, థియేటర్‌లో తినుబండారాల రేట్లు వెరసి ప్రేక్షకులు థియేటర్ల వైపు రావడం మానుకున్నారు. ప్రస్తుత పరిస్థితిల్లో మెదక్ లాంటి పట్టణంలోనే నలుగురున్న కుటుంబం మొత్తం సినిమా చూడాలంటే రూ. వెయ్యి వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి. దీంతో చాలా మంది థియేటర్లకు రావడం మానేశారు.



మూతపడుతున్న థియేటర్లు

మెదక్ జిల్లా కేంద్రంలో సినిమా థియేటర్ల ప్రస్థానం చిన్నదే. మొదటి థియేటర్ 1981లో చక్రధారి ప్రారంభమైంది. యారానా అనే హిందీ సినిమాతో ఈ థియేటర్‌ను ప్రారంభించారు. తర్వాత మయూర 1984లో ప్రారంభమైంది. కృష్ణంరాజు హీరోగా నటించిన బొబ్బిలి బ్రహ్మన్న సినిమాతో ఈ థియేటర్‌లో ప్రదర్శనలు ప్రాంభమయ్యాయి. ఈ థియేటర్ తర్వాతి కాలంలో మేనేజ్‌మెంట్ మారి గంగినేనిగా మారింది. తర్వాత సంఘం థియేటర్ ప్రారంభమైనా ఇప్పుడది మూత పడింది. త్వరలోనే ఇక్కడ షాపింగ్ మాల్ పెడుతున్నారు. సాయి థియేటర్ జ్ఞాపకంగా మారిపోయింది.

ఓటీటీల హవా..

సినిమా హాళ్లకు ప్రేక్షకులు తగ్గేందుకు ఓటీటీలు కూడా కారణమని అంటున్నారు. ఏదైనా సినిమా విడుదల అయిన రెండు మూడు నెలల్లోనే ఓటీటీ ప్లాట్‌ఫాంలోకి వచ్చేస్తోంది. అంత ఖర్చు పెట్టి కుటుంబం మొత్తం థియేటర్‌కు వెళ్లలేని చాలా మంది హాయిగా ఇంట్లోనే ఓటీటీల్లో సినిమాలను ఎంజాయ్ చేస్తున్నారు. వాస్తవానికి ఇళ్లలోనూ పెద్ద పెద్ద టీవీలు అందుబాటులో ఉండగా, సోఫాలో సేద దీరుతూ కుటుంబమంతా కలిసి తమకు ఇష్టమైన సమయంలో సినిమాను ఎంజాయ్ చేస్తున్నారు. ఓటీటీల సబ్‌స్క్రిప్షన్ కూడా తక్కువకే వస్తుండటంతో అందరూ వీటికే మొగ్గుచూపుతున్నారని మెదక్‌కు చెందిన ఆరునార్తి చంద్రశేఖర్ గుప్తా అభిప్రాయపడ్డారు. ఓటీటీల్లో సినిమా అయితే ఇంట్లో పనులు చేసుకుంటూ.. తీరిక సమయంలో చూసుకునే అవకాశం ఉంటుందని ఓ గృహిణి పేర్కొన్నారు. మొబైల్, ల్యాప్‌ట్యాప్, టీవీల్లో కొత్త సినిమాలు, వెబ్ సిరీస్ చూసే సౌకర్యం లభించడంతో జనం సినిమా థియేటర్లకు వెళ్లడం లేదని బట్టి రాజాగౌడ్ అంటున్నారు.

నేరుగా ఓటీటీల్లోనే..



చిన్న సినిమా నిర్మాతలు నేరుగా ఓటీటీల్లో తమ సినిమాలు విడుదల చేస్తున్నారు. మీడియం రేంజ్ సినిమాలు రెండు మూడు వారాల్లోనే ఓటీటీల్లోకి వచ్చేస్తున్నాయి. ప్రేక్షకులు తగ్గడంతో చాలావరకు సినిమా థియేటర్లు మూతపడుతున్నాయి. కనీసం విద్యుత్ బిల్లులో రాయితీలు ఇవ్వకపోతే రానున్న రోజుల్లో సింగిల్ స్క్రీన్ థియేటర్లు అనేవి కనిపించకుండా పోయే ప్రమాదముంది.

- చింతల వినోద్,
బొబ్బిలిదొర సినిమా నిర్మాత

పదేళ్లకు తెరుచుకున్న పదిగేట్లు

● కర్ణాటక, మహారాష్ట్ర నుంచి సింగూరుకు భారీ వరద



సింగూరు ప్రాజెక్టు నుండి విడుదలవుతున్న జలాలు

పుల్కల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మంజీర నది పరివాహక ప్రాంతం విస్తరించి ఉన్న కర్ణాటక, మహారాష్ట్రల నుంచి సింగూరు ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. గత నెల రోజులుగా విరామం లేకుండా సింగూరు ప్రాజెక్టుకు వరద నీరు వచ్చి చేరుతుండటంతో క్రస్ట్ గేట్లను ఎత్తి ఉంచారు. వరద ప్రవాహం అధికంగా ఉండటంతో పదేళ్ల తర్వాత 17 గేట్లలో 10 గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 89,615 క్యూసెక్కులు నమోదుకాగా, ఔట్‌ఫ్లో 89,165 క్యూసెక్కులు నమోదైంది. శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రాజెక్టులో 18.212 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి.

నీట మునిగిన పంటలు..

సింగూరు ప్రాజెక్టు పది గేట్లు ఎత్తి వరద నీరు దిగువకు విడుదలవుతుండటంతో నది పరివాహక ప్రాంతంలోని వేలాది ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. దాదాపు లక్ష క్యూసెక్కుల నీరు వస్తుండటంతో వరి, పత్తి, కంది తదితర పంటలన్నీ నీట మునిగాయి. చౌటకూర్ సమీపంలో మంజీర నదిపై నిర్మించిన కొన్యాల వంతెనపై నుంచి మూడు మీటర్ల ఎత్తులో వరద నీరు ప్రవహిస్తోంది. నదికి చేరువలో ఉన్న లింగంపల్లి గ్రామం వరకు వరద నీరు రావడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.



కొనసాగుతున్న రైల్వే హాల్ట్‌స్టేషన్ పనులు

దసరాకు ప్రారంభం లేనట్టే !

● నత్తనడకన రైల్వే హాల్ట్ స్టేషన్ పనులు

● నెరవేరని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హామీ

కొమురవెల్లి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లన్న క్షేత్రానికి సమీపంలో సుమారు రూ.3 కోట్లతో నిర్మిస్తున్న రైల్వే హాల్ట్ స్టేషన్ నిర్మాణ పనులు నత్తనడకలా నెమ్మదిగా సాగుతున్నాయి. స్వామివారి దర్శనానికి తెలంగాణ నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం రాజీవ్ రహదారికి దగ్గరలో దీన్ని నిర్మిస్తున్నారు. ఈ దసరా నాటికి మల్లన్న హాల్ట్ రైల్వే స్టేషన్ ప్రారంభిస్తామని గతంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపినా పనుల్లో వేగం పుంజుకోవడం లేదు. కాంట్రాక్టర్ నిర్మాణ పనులను నెమ్మదిగా చేస్తుండటంతో దసరా నాటికి ప్రారంభించే అవకాశాలు ఏ కోణంలోనూ కనిపించడం లేదు.

జాతర వరకైనా పూర్తయ్యేనా..?

రైల్వే హాల్ట్ స్టేషన్ నిర్మాణ పనులు 90 శాతం పూర్తయ్యాయని, దసరా నాటికి ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని గతంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కానీ వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు అనుగుణంగా లేదు. 90 శాతం పనులు పూర్తయినా, మిగిలిన 10 శాతం పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతున్నది. స్టేషన్ స్వాగత ద్వారం, విద్యుత్ పనులు, కుళాయిల బిగింపు, వాటర్ సౌకర్యానికి సంబంధించిన పనులు ఇంకా పూర్తికాలేదు. ఈ పనులు పూర్తికావడానికి మరికొంత సమయం పట్టేలా ఉంది. మరో రెండు నెలల్లో జాతర ప్రారంభం కానుంది. జాతర నాటికైనా రైల్వే స్టేషన్‌ను ప్రారంభిస్తే పలు రాష్ట్రాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని భక్తులు కోరుకుంటున్నారు.

అధికారులు చొరవ చూపాలి..



దసరాకు రైల్వే స్టేషన్ ప్రారంభమవుతుందని అనుకున్నాం. కానీ ఇప్పటికి పనులు కొనసాగుతున్నాయి. కేంద్రమంత్రులు, రైల్వే అధికారులు చొరవ చూపి మిగిలిన పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలి.

-కొండ శ్రీధర్, కొమురవెల్లి

శరణు.. మాతా



వర్గల్



మర్పడగ



ఏడుపాయల



కేతకి

వర్గల్/పాపన్నపేట/ఝరాసంగం/కొండపాక, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వర్గల్ విద్యాధరి క్షేత్రంలోని విద్యా సరస్వతీ, ఏడుపాయల వన దుర్గమ్మ, కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలోని దుర్గాదేవి అమ్మవార్లు శనివారం లలితా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కొండపాక మండలం మర్పడగ విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో విజయదుర్గా మాత శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చింది.

ఘనంగా సీఎస్ఐ 79వ ఆవిర్భావ దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

మెదక్, కల్చరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి) చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా (సీఎస్ఐ) 79వ ఆవిర్భావ దినోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు డయాసిస్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలతోపాటు పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మహాదేవాలయంలో క్రైస్తవ సోదరులనుద్దేశించి చర్చి ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య దైవ సందేశం అందించారు. అనంతరం చర్చి ప్రధాన ద్వారం నుంచి నృత్యాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మత గురువులు సంపత్, శాంసన్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



వసతి గృహాల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 27 : ప్రఖ్యాతిగాంచిన సీఎస్ఐ మహాదేవాలయం అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. స్పెషల్ డెవలప్‌మెంట్ కింద మంజూరైన రూ.9 కోట్ల అభివృద్ధి పనులకు ఆయన శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చర్చిలో యాత్రికులకు సరైన వసతులు లేకపోవడం దురదృష్టకరమన్నారు. అంతర్గత రహదారుల నిర్మాణానికి రూ.3కోట్లు, 100 మంది సౌకర్యార్థం రూ.2.50 కోట్లతో వసతి గృహం, మరో రూ.4.5 కోట్లతో వసతి గృహాల నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు వివరించారు. ఇప్పటికే రూ. 18.50 లక్షలతో పూర్తి చేసుకున్న డివైడర్ సెంటర్ లైటింగ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్, నాయకులు బొజ్జ పవన్, శాంసన్ బాణి తదితరులు ఉన్నారు.

కొండా లక్ష్మణ్‌కు ఘన నివాళి



గజ్వేల్-ప్రజ్ఞాపూర్‌లో కొండాలక్ష్మణ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

గజ్వేల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కొండా లక్ష్మణ్ బాపూజీ చూపిన మార్గం అనుసరణీయమని శాసనమండలి సభ్యులు డాక్టర్ వంటేరి యాదవ రెడ్డి అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డితో కలసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్లు గాడిపల్లి భాస్కర్, ఎన్‌సీ రాజమౌళి, తలకొక్కుల రాజు, దేవులపల్లి రాజారాం, తలకొక్కుల దుర్గాప్రసాద్ తదితరులున్నారు.

● **కొండపాక:** మండలంలోని దుద్దెడలో మార్కండేయ పద్మశాలీ సమాజం అధ్యక్షుడు బొజ్జ నరేందర్ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ నాయకులు, పద్మశాలీ సమాజం నాయకులు కొండ లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆరేపల్లి మహదేవ్ గౌడ్, మాజీ ఎంపీటీసీ గురజాడ బాలాజీ, పిల్లి నాగరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ శాస్త్రీయ పద్ధతిలో చేపట్టాలి

గజ్వేల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రీజనల్ రింగ్‌రోడ్డు భూసేకరణ శాస్త్రీయ పద్ధతిలో చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గజ్వేల్ ఆర్డీవో కార్యాలయంలో డీటీ భాగ్యరేఖకు వినతిపత్రాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ... గజ్వేల్, మర్కుక్, జగదేవ్‌పూర్, వర్గల్, రాయపోల్ మండలాల పరిధిలోని సుమారు 20గ్రామాల నుంచి రీజనల్ రింగ్ రోడ్డు వెళ్తుందని, 980 ఎకరాల భూమిని రింగ్‌రోడ్డుకు అవసరమని సర్వే చేశారన్నారు. గజ్వేల్‌లో రీజనల్ రింగ్ రోడ్డు కారణంగా నిరుపేదలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూసేకరణ ద్వారా దాదాపుగా 2,500 కుటుంబాలు ఉపాధి కోల్పోతున్నాయని, ప్రభుత్వం సమగ్రంగా, శాస్త్రీయ పద్ధతిలో సర్వే నిర్వహించి భూసేకరణ తగ్గించాలన్నారు. లేని పక్షంలో రైతులకు భూమికి భూమి ఇవ్వాలని, ప్రతీ కుటుంబానికి 250 గజాల స్థలం ఇవ్వాలని, బహిరంగ మార్కెట్ ధరకు మూడు రెట్లు ధర ఇవ్వాలని లేదా 2013 చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో భవిష్యత్తులో ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. వారితో సీపీఎం నాయకులు రాజు, భూబాధితులు ఎల్లయ్య తదితరులున్నారు.

ట్రెసా కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



సిద్దిపేటలోని రెవెన్యూ భవన్‌లో ట్రెసా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

సిద్దిపేట సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణా రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) సిద్దిపేట జిల్లా కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ట్రెసా సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్, ఎన్నికల నిర్వహణ అధికారి ఎం. నారాయణరెడ్డి తెలిపారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని రెవెన్యూ భవన్‌లో సంఘం ఎన్నికలను నిర్వహించారు. ఈ మేరకు ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా ఎస్.కె. అబ్దుల్ రహమాన్, కార్యదర్శిగా పి.రాజేశంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అసోసియేట్ అధ్యక్షుడిగా కె. రాజిరెడ్డి, ఉపాధ్యక్షురాలిగా పి. మాధవి, కోశాధికారిగా సీహెచ్ బాల్‌రాజుతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా ట్రెసా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. నిరంజన్‌రావు వ్యవహరించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ట్రెసా రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ వి. వెంకటేశ్వర్లు, జిల్లాలోని పలువురు తహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని కలిగిఉండాలి

మిరుదొడ్డి,సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ భక్తి భావాన్ని కలిగి ఉండాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సూచించారు. శనివారం మిరుదొడ్డి రామాలయం వద్ద ఏర్పాటుచేసిన దేవీశరన్నవరాత్రోత్సవాలు పురస్కరించుకునిరాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్యతో కలిసి ఎమ్మెల్యే దుర్గామాత అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం అమ్మవారివద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకు ఆలయంలో పూజలను నిర్వహించిన ఎమ్మెల్యేను దుర్గాదేవి మండప నిర్వాహకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తోట కమలాకర్‌రెడ్డి, అంజిరెడ్డి, లింగం, భైరయ్య, కిష్టయ్య తదితరులున్నారు.

ఏడో రోజునే వీధులు పూలవనమాయె..



కలెక్టరేట్‌లో ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడుతున్న కలెక్టర్ హైమావతి, అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్



చిన్నకోడూరు:మాచాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మాజీ మంత్రి సతీమణి శ్రీనిత, సలేంద్రిలో..



చిన్నకోడూరు మండల కేంద్రంలో..



కొండపాక మండలం దమ్మకపల్లిలో..

● పలు గ్రామాల్లో సద్దుల బతుకమ్మ సందడి

న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బతుకమ్మ పండుగను సాధారణంగా తొమ్మిది రోజులపాటు జరుపుకుంటారు. అయితే కొన్ని గ్రామాల్లో 7 రోజులపాటు బతుకమ్మ పండుగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ నెల 21న మహాలయ అమావాస్య రోజున ఎంగిలి పూల బతుకమ్మతో ప్రారంభమైన బతుకమ్మ వేడుకలు శనివారం సద్దుల బతుకమ్మతో సందడిగా ముగిశాయి. ఆడపడచులు, బంధువుల రాకతో ఉదయం నుంచే ఆయా గ్రామాలు పండుగ వాతావరణంతో కొత్త శోభను సంతరించుకున్నాయి. వీధులన్నీ పూల వనాలను తలపించాయి. సాయంత్రంవేళ రంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను ఆయా గ్రామాల్లో కూడళ్లలోకి చేర్చి మహిళలు, యువతులు, చిన్నారులు ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. చీకటి పడేవేళ గ్రామ సమీపంలోని చెరువులు, కుంటల్లోకి పోయిరా గౌరమ్మ అంటూ నిమజ్జనం చేశారు. అనంతరం మహిళలు వెంట తెచ్చుకున్న ఫలహారాలను ఒకరికొకరు వాయినంగా ఇచ్చి పుచ్చుకున్నారు. కాగా పలు ప్రభుత్వ కార్యాలయాల్లో సైతం మహిళలు బతుకమ్మ ఆడారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్, కమిషనరేట్‌లలో పండుగ సందడి కనిపించింది.



కొండపాకలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి గ్రామంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



సిద్దిపేట కమిషనరేట్‌లో మహిళలు, చిన్నారుల బతుకమ్మ సందడి



జగదేవ్‌పూర్: మునిగడపలో అమ్మవారికి కుంకుమార్చన

ఘనంగా కుంకుమార్చన

చేర్యాల/జగదేవపూర్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): దేవీనవరాత్రోత్సవాలను పురస్కరించుకుని జిల్లాలోని పలు మండపాల్లో శనివారం కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలోని భవానీ రుద్రేశ్వరాలయంలో మహిళలు సామూహిక కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. ఉల్లెంగల సేవాట్రస్ట్ ప్రతినిధులు ఏకానందంపద్మ దంపతులు మహిళలకు చీర, ప్రసాదం కానుకగా పంపిణీ చేశారు. జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్, మునిగడప గ్రామాల్లో అమమ్మవారి మండపాల్లో మహిళలు సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో గిరిజనులకు అన్యాయం



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

హుస్నాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఒక్క బీసీలకు మాత్రమే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మిగతా వర్గాలను పక్కన బెడుతున్నారని ఆరోపిస్తూ శనివారం హుస్నాబాద్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట గిరిజన సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. ముఖ్యంగా ఈ రిజర్వేషన్లతో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. బీసీలకు 2024 జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్ల కల్పిస్తూ గిరిజనులకు 2011 జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్లు కల్పించడం అన్యాయమన్నారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనుల మనోభావాలను దెబ్బతీస్తుందన్నారు. గిరిజన, లంబాడి ప్రజలకు సరైన న్యాయం జరగకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు తిరుపతి నాయక్, మోతీలాల్‌నాయక్, సత్యంనాయక్ తదితరులున్నారు.

బస్సు కోసం చెట్ల కొమ్మల తొలగింపు



రోడ్డుకిరువైపులా చెట్లకొమ్మలను తొలగింపజేస్తున్న మాజీ సర్పంచ్

మద్దూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగపల్లి గ్రామానికి రోడుకు ఇరు వైపులా ఏపుగా పెరిగిన పిచ్చి చెట్ల కారణంగా బస్సు సౌకర్యం నిలిచిపోయింది. దీంతో శనివారం మాజీ సర్పంచ్ గంగి భాగ్యలక్ష్మీశ్రీనివాస్ సొంత డబ్బులు వెచ్చించి రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లను ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగింపజేశారు. రోడ్డుపైకి అడ్డంగా పెరిగిన చెట్ల కొమ్మల కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, వాటిని తొలగిస్తే బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరిస్తామని ఆర్టీసీ అధికారులు చెప్పడంతో చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టినట్టు మాజీ సర్పంచ్ వివరించారు.

కాంగ్రెస్‌కే ప్రజల ఆశీస్సులు

● జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

చేర్యాల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు సంక్షేమపథకాలను అమలు చేస్తున్న కాంగ్రెస్‌కు రాష్ట్రప్రజల ఆశీస్సులున్నాయని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. చేర్యాల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుతథ్యమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం పట్టణానికి చెందిన కాటి పుష్పకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు దాసరి శ్రీకాంత్, మార్కెట్ వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి, నాయకులు ఆడెపు చంద్రయ్య, పాల లక్ష్మీనారాయణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దసరా రోజు మటన్ అమ్మకాలకు అనుమతులు ఇవ్వండి

గజ్వేల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): దసరా పండుగ గాంధీజయంతి రోజునే జరుపుకోవడం వల్ల మటన్ అమ్మకాలకు అనుమతులు ఇవ్వాలని గజ్వేల్ సూర్యవంశ ఆరెకటిక సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం మునిసిపల్ కమిషనర్ బాలకృష్ణకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గాంధీ జయంతి రోజున మటన్ అమ్మకాలపై నిషేధం ఉందని, అయితే అదే రోజున దసరా పండుగ రావడం వల్ల తమ జీవనోపాధికి ఆటంకం కలగకుండా మటన్ అమ్మకాలకు అవకాశం ఇవ్వాలని కోరినట్టు తెలిపారు.

వరదముప్పు నివారించాలి

చేర్యాల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వరదనీటిముప్పు నివారించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని పలు కాలనీలవాసులు శనివారం వేర్వేరు ప్రదేశాల్లో ఆందోళనకు దిగారు. కడవేరుగు దారి, గాంధీచౌక్, యూనియన్‌బ్యాంక్ ఏరియా వాసులు స్థానిక గాంధీ చౌక్ వద్ద ఆందోళన చేపట్టారు. కుడిచెరువు వరదనీటి నాలా, కల్వర్టులు ఆక్రమణకు గురవడంతో తమ ఇళ్లు నీటమునిగి, సుమారు నెలరోజులుగా తీవ్ర ఇబ్బందులుపడుతున్నామని వాపోయారు. నీటిపారుదల శాఖ, మునిసిపల్ అధికారులకు ఎన్నోసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అలాగే యాదవనగర్, రాజీవ్‌నగర్, శుభోదయనగర్ కాలనీ వాసులు చుంచనకోట క్రాస్‌రోడ్డు వద్ద పెద్దచెరువు మత్తడి ఆవరణలో రాస్తారోకో నిర్వహించారు. పెద్దచెరువు మత్తడి నీటి కాలువను అర్ధాంతరంగా వదిలేయడంతో తమ ఇళ్లలోకి భారీగా నీరు చేరుతుందన్నారు. సంబంధిత అధికారులు మరో మార్గంలో నీటిని మళ్లించేందుకు చర్యలు



చేర్యాల గాంధీచౌక్ వద్ద రోడ్డుపై బైఠాయించిన యూనియన్‌బ్యాంక్ ఏరియావాసులు

తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా స్థానికుల నిరసనలతో ఆయా ప్రదేశాల్లో వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు చేరుకుని ఆందోళన విరమింపచేశారు. కాగా మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు దాసరి శ్రీకాంత్, చేర్యాల సీఐ ఎల్ శ్రీను, తహసీల్దారు దిలీప్‌నాయక్ తదితరులు ఆయా కాలనీల్లో పర్యటించి వరదనీటి ప్రవాహ పరిస్థితి పరిశీలించారు. బీఆర్ఎస్ హయాంలో అసంబద్ధంగా పెద్దచెరువు కాలువ నిర్మాణం చేపట్టడంతో ఆయా కాలనీలు ముంపుబారినపడ్డాయన్నారు.

వీడిన ఉత్కంఠ.!

(5వ పేజీ తరువాయి)

ప్రకటించారు. ఆర్డీవో కార్యాలయాల్లో సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలకు డ్రా విధానంతో రిజర్వేషన్లు కేటాయించారు. కలెక్టరేట్‌లో జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు సంబంధించిన రిజర్వేషన్లను లాటరీ తీశారు. దీంతో పల్లెల్లో ఎన్నికల వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.

రిజర్వేషన్లపై వివాదం

జడ్పీటీసీ, ఎంపీపీల రిజర్వేషన్లపై వివాదం నెలకొన్నది. గిరిజన జనాభా అత్యధికంగా ఉన్న అక్కన్నపేట, హుస్నాబాద్ మండలాలను జనరల్ కోటాకు కేటాయించడపై తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈసారి ధూళిమిట్ట మండల ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలను ఎస్టీ జనరల్‌కు కేటాయించడం గమనార్హం. దీనిపై హుస్నాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆ వర్గం ప్రజలు ఆందోళనకు దిగారు. అదే విధంగా సిద్దిపేట నియోజకవర్గంలోని 5 మండలాల్లో 4 మండలాలను బీసీలకు కేటాయించడంతో ఓసీ వర్గానికి చెందిన నేతలు నిరుత్సాహానికి లోనయ్యారు. రిజర్వేషన్లలో లోటుపాట్లు ఉన్నాయని అభ్యంతరాలు వ్యక్తపరుస్తున్నారు. హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాల్లో తమ సామాజిక వర్గానికి ఇటు ఎంపీపీ, అటు జడ్పీటీసీ స్థానాల్లో చోటు కల్పించకపోవడంపై ఎస్సీలు మండిపడుతున్నారు. రిజర్వేషన్లు పునరాలోచించాలని కోరుతున్నారు.


ఆ మండలాలకే జడ్పీ పీఠం

జిల్లా పరిషత్ చైర్మన్ స్థానాన్ని బీసీ జనరల్‌కు కేటాయించారనే సంకేతాలు వచ్చాయి. దీంతో ఆయా మండలాల నుంచి బీసీ జనరల్ స్థానాల్లో గెలిచిన వారికే అవకాశం దక్కుతుంది. బీసీ మహిళలు సైతం పోటీలో ఉండవచ్చు. ప్రధానంగా సిద్దిపేట అర్బన్, నంగునూరు, నారాయణరావుపేట, మిరుదొడ్డి, కోహెడ, చిన్నకోడూరు మండలాల్లో జడ్పీటీసీలుగా గెలిచే అభ్యర్థులకు అవకాశం ఎక్కువగా ఉంది. క్రితంసారి చిన్నకోడూరు మండలం నుంచి గెలిచిన వేలేటి రోజాశర్మ జనరల్ మహిళ స్థానంలో జడ్పీ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో అదృష్టం ఎవరిని వరిస్తుందో వేచిచూడాలి.

దంచికొట్టింది

(5వ పేజీ తరువాయి)

ఇండియా ప్రాంతం, గాంధీచౌక్ జలమయమైంది. అలాగే పెద్దచెరువు మత్తడి ప్రవాహ నీటి మళ్లింపు కాలువ అర్ధాంతరంగా నిలిపివేయడంతో ఏడో వార్డు పరిధిలోని శుభోదయనగర్, రాజీవ్‌నగర్ గుండా గాంధీచౌక్ పరిసరాల వరకు అంతర్గత దారుల గుండా వరద నీరు ప్రవహించి జనావాసాలలోకి చేరాయి. ఆయా కడవేరుగు దారిలోని ఓక్లే పాఠశాల ఆవరణ అంతా నీట మునిగింది. చేర్యాల-కడవేరుగు దారి వెంబడి నీరు నిలవడంతో కాలినడకన నడుచుకుంటూ ఇబ్బందులు పడ్డారు. గాంధీచౌక్ కల్వర్టు నుంచి సెవెన్‌హిల్స్ హోటల్ వరకు రోడ్డుపై మోకాలిలోతు నీరు నిలవడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగింది. తహసీల్దారు దిలీప్‌నాయక్, చేర్యాల సీఐ ఎల్.శ్రీను తదితరుల పర్యవేక్షణ నడుమ డివైడర్లను ధ్వంసం చేసి కల్వర్టుల గుండా వరద నీటి మళ్లింపునకు చర్యలు చేపట్టారు.



జనగామ-సిద్దిపేట జాతీయ రహదారిపై నిలిచిన వరదనీరు, చేర్యాల ఆర్టీసీ బస్టాండు సమీపంలో నిలిచిపోయిన బస్సులు, వాహనాలు

న్యూస్ బాక్స్

నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు

చేర్యాల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం చుంచనకోట గ్రామంలో పోలీసులు నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు చేపట్టారు. గ్రామంలోని పలు కిరాణా దుకాణాలు, టీ స్టాల్స్, ఇతరత్రా అనుమానాస్పద ప్రదేశాల్లో జాగిలాలతో సోదాలు నిర్వహించారు. అనంతరం ఎస్ఐ నవీన్ మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తుపదార్థాలు వినియోగించినా, రవాణా చేసినా, సేవించినా చర్యలు తప్పవని సూచించారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ



కార్మికులకు నూతన దుస్తులను అందిస్తున్న పోల్కంపల్లి జయంతి నరేందర్

కుకునూరుపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కుకునూరుపల్లి పారిశుధ్య కార్మికులకు శనివారం మాజీ సర్పంచ్ పోల్కంపల్లి జయంతి నరేందర్ కొత్త దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ఏటా కార్మికులతో పాటు పేదలకు నూతన దుస్తులు అందజేసే ఆనవాయితీని పాటిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాసం నవీన్, కిష్టారెడ్డి ,కార్యదర్శి స్వప్న గ్రామస్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

గజ్వేల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని గజ్వేల్ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన 62మందికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను ఆయన అందజేశారు. ఆయనవెంట మాజీ మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, పట్టణ పార్టీ అధ్యక్షుడు నవాజ్‌మీరా, ఫాక్స్ చైర్మన్‌లు జేజాల వెంకటేశ్, ఇంద్రసేనారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● మద్దూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మద్దూరు మండలంలోని మర్మాముల గ్రామానికి చెందిన జంగిలి అయిలయ్యకు మంజూరైన రూ. 60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి శనివారం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు ఆలేటి విష్ణు, మాజీ వైస్ ఎంపీపీ పెద్దవూట్ల భూపతిరెడ్డి, మాజీ సర్పంచ్ వెల్డి లక్ష్మీగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుద్దెడలో ఊరికో జమ్మి చెట్టు



మొక్కను నాటుతున్న ట్రస్టు సభ్యులు

కొండపాక, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం దుద్దెడలో ఊరికో జమ్మి చెట్టు.. గుడికో జమ్మిచెట్టు కార్యక్రమంలో భాగంగా శనివారం స్వయంభూ శంభుని ఆలయం ఆవరణలో ట్రస్ట్ చైర్మన్ మంచాల శ్రీనివాస్ తదితరులు జమ్మి మొక్కలు నాటారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ర్యాగల సుగుణ దుర్గయ్య, మాజీ సర్పంచ్ పెద్దంకుల శ్రీనివాస్, హరితసేన కోఆర్డినేటర్ దోమల దుర్గా ప్రసాద్, ననువాల రవి ఆలయ పూజారి వ్యాస నారాయణ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

చెరువులను మరమ్మతు చేయాలి

గజ్వేల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చెరువు, కుంటలను మరమ్మతు చేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాపరెడ్డి డిమాండ్ చేశారు. గజ్వేల్ మండల పరిధిలోని పిడిచెడ్ గ్రామంలోని లక్ష్మిదేవి చెరువును శనివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం కట్ట ప్రమాదంలో ఉందని తెలిసి కూడా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పిడిచెడ్ రైతులు తలా కొంత రూ.1000 చొప్పున వేసుకుని కట్ట మరమ్మతులు చేయించడం చూస్తే ప్రభుత్వ అసమర్థత అర్థం అవుతుందన్నారు. వెంటనే కలెక్టర్ స్పందించి సమస్యకు పరిష్కారం చూపి, పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల పట్ల ముందు చూపు లేదన్నారు. వారివెంట మాజీ జడ్పీటీసీ పంగ మల్లేశం, ఫాక్స్ చైర్మన్‌లు జేజాల వెంకటేశ్‌గౌడ్, ఆలేటి ఇంద్రసేనారెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, నాయకులు ఉన్నారు.

బాధితుల ముందస్తు అరెస్టు సరికాదు

హుస్నాబాద్‌టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ ప్రాంత పరిధిలో నివసిస్తున్న జీవో 317 బాధితులను శనివారం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. 317 బాధితులందరిని ఒకే రకంగా చూడటం సరికాదని, జీవో 317లో బదిలీ అయిన రిటైర్డ్ అయిన బాధితులను శనివారం హైదరాబాద్‌లోని సెక్రటరీయేట్ ఎదుట ధర్నాకు పిలుపునిచ్చారని పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు బూట్ల రాజమల్లయ్య తెలిపారు. కాని జీవో 317 ద్వారా డిస్లొకేటెడ్ అయిన బాధితులైన తమను ముందస్తు అరెస్ట్ చేయడం అమానుషమన్నారు. అరెస్ట్ అయిన వారిలో ఉపాధ్యాయులు రవీందర్, కాయిత శ్రీనివాస్‌రెడ్డి, అయిల బాలకిషన్‌లున్నారు.